# సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా




ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, ఫిబ్రవరి 5 : అత్యవసర పరిస్థితుల్లో దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎం సహాయనిధి ఎంతో భరోసానిస్తుందని జహీరాబాద్ బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని బుర్దిపాడ్‌కు చెందిన పద్మకు రూ. 30వేలు, అర్జున్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ సంతోష్‌కు రూ.18 వేలు, సత్వార్‌కు చెందిన యాసీన్‌బేగానికి రూ. 60 వేలు, గడక్‌తండాకు చెందిన సంతోష్‌కు రూ. 25,500 కలిపి మంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 1.03 లక్షల చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ నామరవికిరణ్, నాయకులు హీరు రాథోడ్, కరణ్‌రాజ్, రాములు, దత్తరెడ్డి, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వర్రకుంట కబ్జాపై విచారణ జరిపిస్తాం

## అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



బొల్లారం మున్సిపాలిటీలో వర్రకుంట కబ్జా వివరాలను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

జిన్నారం, ఫిబ్రవరి 5 : జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 82లో వర్రకుంట (జుర్రుకుంట) నానాటికి కబ్జాకు గురవుతుందని స్థానికులు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి కబ్జాకు గురికాబడిన వర్రకుంటను బుధవారం సందర్శించారు. కుంట ఆక్రమణ జరిగిన తీరును అందుకు సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం కుంట ఉందని, కానీ భౌతికంగా పరిశీలిస్తే కుంట ఆనవాళ్లు లేవని అధికారులు గ్రహించారు. ఎట్టి పరిస్థితిలో కుంటల కబ్జాకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించాలని చూస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కబ్జా నామరూపాలు లేకుండా చేశారని గతంలోనే అధికారులను ఫిర్యాదులు అందిన సందర్భాలు ఉన్నాయి. కుంటకు సంబంధించిన రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు విచారణ జరిపి గుర్తించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

# తారా కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రావు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : ప్రతి వ్యక్తికి జీవితంలో కెరీర్ ప్రధానమైనదని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రావు పేర్కొన్నారు. బుధవారం తారా ప్రభుత్వ కళాశాలలో వాణిజ్య విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామ్మోహన్ రావు విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. కెరీర్‌ను ఏవిధంగా ఎంచుకోవాలి, కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాభివృద్ధి ఏవిధంగా పెంపొందించుకోవాలి, వాటి ద్వారా జీవితంలో ఏవిధంగా ఉన్నత స్థాయిలో స్థిరపడాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ కరుణ, ఈఎస్‌సీ మార్కెటింగ్ మేనేజర్ కిషన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### తారా కళాశాలను సందర్శించిన బెటాలియన్ కమాండింగ్ అధికారి

నిజామాబాద్ రేంజ్ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ రమేశ్ కుమార్ బుధవారం స్థానిక తారా ప్రభుత్వ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని ఎన్‌సీసీ విభాగం సందర్శించి రికార్డులు పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

# గీతం నూతన వీసీగా డాక్టర్ ఎర్రోల్ డిసౌజా



ఉప కులపతి డాక్టర్ ఎర్రోల్ డిసౌజా

పటాన్‌చెరు, ఫిబ్రవరి 5 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి (వీసీ)గా డాక్టర్ ఎర్రోల్ డిసౌజా నియమితులయ్యారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ విడుదల చేసిన ఒక ప్రకటనలో వీసీ నియామకం వివరాలు వెల్లడించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎర్రోల్ డిసౌజా బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ప్రముఖ విద్యావేత్తగా అభివర్ణించారు. డిసౌజా ప్రఖ్యాత ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ అని, ముంబై విశ్వవిద్యాలయంలో ఐఎఫ్‌సీఐ చైర్ ప్రొఫెసర్‌గా, పారిస్‌లోని సైన్సెస్ పోలో ఇండియా చైర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారని వెల్లడించారు. గీతం అధ్యక్షుడు ఎం. శ్రీభరత్ ఆన్‌లైన్లో నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశంలో ఈ విషయాన్ని అందరికీ వెల్లడించినట్టుగా తెలిపింది. డాక్టర్ డిసౌజా నియామకం పట్ల గీతం అధ్యక్షుడు శ్రీభరత్ హర్షం వ్యక్తం చేశారు.

## మైహోం అంకుర అధ్యక్షుడిగా దినేశ్ వాకటి..

రామచంద్రాపురం, ఫిబ్రవరి 5 : తెల్లాపూర్‌లోని మైహోం అంకుర గేటెడ్ కమ్యూనిటీ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా దినేశ్‌వాకటి ఎన్నికయ్యారు. బుధవారం నూతనంగా ఎన్నికైన సొసైటీ కార్యవర్గం విలేకరులకు వివరాలు తెలిపారు. మైహోం అంకుర గేడెట్ కమ్యూనిటీ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా దినేశ్‌వాకటి, ఉపాధ్యక్షుడిగా మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి, కార్యదర్శిగా ఆదిత్యరాజన్, కోశాధికారిగా రాధికరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రాఘురాంరెడ్డి, సంయుక్త కోశాధికారిగా ఉషా, డైరెక్టర్లుగా నగేశ్, కార్తీక్, శైలని సొసైటీ సభ్యులు ఎన్నుకున్నారు. మైహోమ్ అంకుర వాసులకు అండగా నిలిచి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని వారు తెలిపారు.

## జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

మునిపల్లి, ఫిబ్రవరి 5 : జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఇబ్రహీంపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై కథనం ప్రకారం.. ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మున్నూర్ కృష్ణ (45)కు కొన్నేండ్ల నుంచి అనారోగ్యంతో బాధపడున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య మున్నూర్ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పాన్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

సంగారెడ్డి,ఫిబ్రవరి 5 : నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు విక్రయిస్తున్న 12 పాన్‌షాపుల యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరు టాస్క్‌ఫోర్సు బృందాలు బుధవారం సంగారెడ్డి, పటాన్‌చెరు, పుల్కల్ ప్రాంతంలోని పలు పాన్‌షాపులపై ఆకస్మికదాడులు నిర్వహించాయి. సంగారెడ్డి, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, పటాన్‌చెరు, ముత్తంగి చౌరస్తా, పుల్కల్ ప్రాంతంలోని పలు పాన్‌షాప్‌లపై టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆకస్మిక దాడులు చేశా రు. ఈ దాడుల్లో 12 పాన్‌షాపుల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు విక్రయించటంతోపాటు నిల్వలు ఉన్నట్లు పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయి విక్రయించినా రవాణా చేసినా నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని జిల్లా ఎస్పీ రూపేశ్ కోరారు. సంగారెడ్డి జిల్లా నార్కోటిక్స్ అనాలసిస్ బ్రాంచ్ 8712656 777 కు సమాచారం ఇవ్వాలన్నారు.

## నీటి సరఫరాలో అంతరాయం

హుస్నాబాద్, ఫిబ్రవరి 5: కరీంనగర్ సమీపంలోని ఎల్ఎండీ వద్ద గల మిషన్ భగీరథ ప్రధాన పంపుహౌజ్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దీని పరిధిలోని నియోజకవర్గాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామ్‌కుమార్ తెలిపారు. 6వ తేదీ నుంచి 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

# పాతపంటల పరిరక్షణకు కృషి



అలంకరించిన బండ్లను ఆటపాటలతో ఊరేగిస్తున్న సభ్యులు

ఝరాసంగం, ఫిబ్రవరి 5 : పాతపంటల పరిరక్షణకు డీడీఎస్ మహిళా సంఘాలు ఎంతో కృషి చేస్తున్నాయని పస్తాపూర్ డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ గిరిధర్ బాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిల్కపల్లిలో డీడీఎస్ ఆధ్వర్యంలో 25వ పాత పంట జాతరను ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా గ్రామంలోని వీధి వీధినా బోనాలు, విత్తనాలతో అలంకరించిన బండ్లనూ ఊరేగిస్తూ చిరుధాన్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జాతర కో-ఆర్డినేటర్లు వినయ్ కుమార్, మంజుల, డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త హేమలత, సూపర్‌వైజర్ బాలయ్య, డీడీఎస్ సిబ్బంది విజయలక్ష్మి, నర్సమ్మ, చుక్క మ్మ, శ్రీలయ, ప్రహ్లాద్, నర్సింహులు, సంపత్ పాల్గొన్నారు.

## దవాఖాన సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సూపరింటెండెంట్ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 5 : ప్రభుత్వ దవాఖానల సిబ్బందికి నాలుగు నెలలుగా చెల్లించాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ దవాఖానల్లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ, హౌజ్ కీపింగ్, పేషెంట్ కేర్ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నాయకులు చిరంజీవి, ఆనంద్, భాగయ్య, అశోక్, సిబ్బంది భారతి, అలీషా, సుజాత, లక్ష్మి, యశోద, కవిత, పారమ్మ, రాములు, బాలమ్మ, విఠల్ పాల్గొన్నారు.

## ఏబీసీ కేటగిరీలను తక్షణమే సవరణ చేయాలి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 5 : ఎస్సీ వర్గీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏబీసీ కేటగిరీలను తక్షణమే సవరణ చేయాల్సిన అవసరం ఉన్నదని భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదిక సమర్పించడం అభినందనీయం, కానీ ఎస్సీ వర్గీకరణలో ఏబీసీ కేటగిరీలను తక్షణమే సవరణ చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన లేదా వెనుకబాటు తనం చూసినా బీ కేటగిరీలో 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సి ఉండగా 9 శాతం ప్రకటించడం సరైంది కాదన్నారు. ఏ కేటగిరీలో అత్యంత వెనుకబాటు తరగతికి చెందిన వారు ఉండాల్సి ఉండగా కొన్ని అభివృద్ధి చెందిన కులాలను చేర్చడం బాధాకరమన్నారు. 15 లక్షల జనా భా ఉన్న సీ కేటగిరీకి 5 శాతం కల్పించినప్పుడు 32 లక్షల జనాభా ఉన్న బీ కేటగిరీకి 11శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని, రాష్ట్ర ప్రభుత్వం ఆవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేతన్న పొదుపు పథకం అమలుకు దరఖాస్తులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : జిల్లాలో చేనేత పరిశ్రమ - నేతన్న పొదుపు పథకం అమలు చేసేందుకు అర్హత కలిగి, జియోట్యాగింగ్ నెంబర్ కలిగి, చేనేత వృత్తి జీవనాధరంగా ఉన్న చేనేత, అనుబంధ కార్మికుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్లు వయస్సు పైబడిన వారు, వారి ఆదాయంలో కనీసం 50 శాతం ఆదాయానిన చేనేత వృత్తి నుంచి పొందుతున్న వారు ఈ పథకంలో చేరడానికి అర్హులని స్పష్టం చేశారు. అర్హత గల చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు 15లోగా కలెక్టరేట్‌లోని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న హద్నూర్ ఎస్సై చల్ల రాజశేఖర్

జహీరాబాద్, ఫిబ్రవరి 5 : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హద్నూర్ ఎస్సై చల్ల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని శ్రీవాణి విద్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరి అవగాహన ఉండాలన్నారు. బ్యాంకు అధికారులుగా మాట్లాడేవారు, రుణాలు ఇస్తామని చెప్పేవారిని నమ్మొద్దన్నారు. రోడ్లపై వెళ్లేటప్పుడు ప్రతి వాహనదారుడు కచ్చితంగా నియమాలు పాటించాలని, వాటిని సంబంధించిన పత్రాలు విధిగా కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టారీత్యా చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం శివకుమార్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి



దౌల్తాబాద్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

హత్నూర, ఫిబ్రవరి 5 : త్వరలో జరగబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం హత్నూర మండలంలోని దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ఆరా తీయడంతో పాటు స్నాక్స్ ఏవిధంగా అందిస్తున్నారని తెలుసుకున్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థుల్లో చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి వహించి పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉన్నత ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్ఎం కందర్ప, సీఆర్పి యా దగిరి ఉపాధ్యాయులు ఉన్నారు.

## గుమ్మడిదల బంద్‌కు పిలుపు నిచ్చిన అఖిల పక్షనేతలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 5 : ప్యారానగర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా గురువారం అఖిలపక్షాల నాయకులు బంద్‌కు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ముఖ్య నాయకులను అరెస్టు చేసిన పోలీస్ అధికారులు వెంటనే బేషరత్‌గా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురువారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో వాణిజ్య, వ్యాపార సముదాయాలు, బంద్‌కు ప్రజలు సహకరించాలని అఖిల పక్షాల నాయకులు పిలుపునిచ్చారు.

# ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం




సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి, మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు

సిద్దిపేట, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జంజీరపు ఎల్లేశ్ అన్నారు. బుధవారం సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లు పాస్ అయినందున తదుపరి బిల్లు న్యాయ, రాష్ట్రపతి పరిశీలనకు పంపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్లు అల్లిబిల్లి నరసింహారావు, గూడమల్ల సత్తయ్య, సామాజిక ఉద్యమకారుడు కోదాటి శ్రీనివాస్, కో కన్వీనర్ బొమ్మల విజయ్, పోతుల మోహన్, మాల మహానాడు ప్రచార కార్యదర్శి గుడిసెల దేవదాస్, ఏడ శేఖర్, బొమ్మల అజయ్, గ్యాదరి వాసు పాల్గొన్నారు.

**రాజకీయపార్టీల దిష్టిబొమ్మ దహనం**

మిరుదొడ్డి, ఫిబ్రవరి 5: మాల మాదిగల మధ్య రాజకీయ పార్టీలు చిచ్చు పెడుతున్నాయని జాతీయ మాల మహానాడు మిరుదొడ్డి మండల అధ్యక్షుడు దార స్వామి అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం మిరుదొడ్డి టౌన్‌లో మాల మహానాడు నాయకులు రాజకీయ పార్టీల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలల హక్కులను కాలరాస్తున్నాయని మండి పడ్డారు. కార్యక్రమం లో మాల మహానాడు నాయకులు మల్లయ్య, మంకయ్య, లింగం, నితిన్, పరశురాములు, చంద్రం, నర్సింహులు, రాజయ్య పాల్గొన్నారు.

**వర్గీకరణ అంశాన్ని కేంద్రం రద్దు చేయాలి**

ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రద్దు చేయాలని జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు అన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లిలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ కులాల మధ్య చిచ్చు పెడుతూ వారి హక్కులను కాల రాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, సుమన్, బుచ్చయ్య, స్వామి, కుమార్, కొండయ్య పాల్గొన్నారు.

**నారాయణరావుపేటలో...**

నారాయణరావుపేట, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టినందుకు నిరసనగా మండలంలో మాల సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, బ్యాగారి నర్సింహులు, చేగురి నర్సయ్య. మహంకాళి భిక్షపతి, బిట్ల కైలాష్, కృష్ణ, తునికి మహేశ్ పాల్గొన్నారు.

**ఎస్సీ వర్గీకరణ తప్పుల తడక**

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణ తప్పుల తడక అని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి కన్వీనర్లు సత్తయ్య,నరసింహారావు అన్నారు. మాలల ఓట్లతో గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి మాలలకు తీరని అన్యాయం చేశాడని మండిపడుతూ బుధవారం సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఇచ్చిన కులగణన తప్పుల తడకగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మలహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు కొదాది శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఎల్లేశ్, మోహన్, విజయ్‌కుమార్, కృష్ణ, వాసు పాల్గొన్నారు.

**ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన**

చేర్యాల, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో మాలమహానాడు నాయకులు కండ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకంగా కులగణన చేయకుండా ఎస్సీ వర్గీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో కమలాపురం కిష్టయ్య, చింతల విజయ్‌కుమార్, శ్రీరాం వెంకటేశ్, చందా శ్రీకాంత్, పుట్టరాజు, గుస్క గోవర్ధన్, పాకనాటి భాస్కర్, బుట్టి శ్రీనివాస్, కమలాపురం శేఖర్ పాల్గొన్నారు.



చేర్యాలలో కండ్లకు నల్లగుడ్డ కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మాలమాహానాడు నాయకులు

**దుబ్బాకలో..**

దుబ్బాక, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి లేఖను పంపించడాన్ని నిరసిస్తూ దుబ్బాకలో మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర మాల మహానాడు పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, కాల్వ నరేశ్, కాల్వ లింగం, ఆసయాదగిరి, స్వామి,సురేశ్, ప్రభాకర్, రాజు, ఎల్లం పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు




అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

అక్కన్నపేట, ఫిబ్రవరి 5: మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను బుధవారం అక్కన్నపేట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో జరుగనున్న చలో సెక్రటేరియట్‌కు వెళ్లకుండా పోలీసులు ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా తమ సమస్యను పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

**గజ్వేల్‌లో..**

గజ్వేల్, ఫిబ్రవరి 5: పెండింగ్ బిల్లులు విడుదల వేయాలని డిమాండ్ చేస్తూ చలో సచివాలయానికి పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అక్కారం, అనంతరావుపల్లి, ర్యాగట్లపల్లి గ్రామాల మాజీ సర్పంచ్‌లు బాల్‌చంద్రం, మహేందర్, పాండు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పీఎస్ వద్ద వారు మాట్లాడారు. ముందస్తుగా ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పరామర్శ..



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 5 : నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేట్‌కు చెందిన చాకలి పోచమ్మ మృతిచెందడంతో బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు లింగయ్యతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట కల్హేర్ మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ దత్తు, నాయకులు చంద్రశేఖర్, బాలరాజు, సిద్ధు, వెంకటేశం ఉన్నారు.

### నాగల్‌గిద్దలో..

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 5 : నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఎస్గీ గ్రామానికి చెందిన న్యాయవాది కిషన్‌రావు మృతి చెందారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నర్సింహారెడ్డి, విఠల్‌రావు పాటిల్, లక్ష్మణ్ నాయక్, నేతలు ఉన్నారు.

### కందిలో..



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

కంది, ఫిబ్రవరి 5 : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యనారాయణ కుటుంబ సభ్యులను బుధవారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. సంగారెడ్డిలోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆందోళన చెందకుండా మనోధైర్యంగా ఉండాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు పెరమాళ్ల నర్సింహులు, నర్సింగ్‌రావు ఉన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అధికారులతో కలిసి పర్యటిస్తున్న చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు

పుల్కల్, ఫిబ్రవరి 5 : రానున్న రోజుల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర రూరల్ వాటర్ సప్లై చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం పుల్కల్ మండలంలోని ఇసోజిపేటలో స్పెషల్ డ్రైవ్ లో భాగంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయా, మంచినీరు ప్రతిరోజు అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హుస్నాపూర్‌లోని వాటర ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ రాఘవేందర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాషా, నాగభూషణం, జోగిపేట సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తిమృతి

హత్నూర, ఫిబ్రవరి 5 : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తిమృతిచెందిన సంఘటన హత్నూర మండలం కాసాల శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. గ్రామానికి చెందిన పాములకిరణ్ (35) ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు వెల్లడించారు.

URGENTLY REQUIRED
PRINCIPAL & TEACHERS
Required Qualified and Well Experienced Teachers to Teach in a Reputed School At ZAHEERABAD For Primary and High school Level to Teach All Subjects and Also Computer Operators
Salary Structure: Primary: 15000 & Above, And H. School : 25000 &Above
For Details Contact
72072 08292